12న నులి పురుగుల నివారణ దినోత్సవం

కొణిజర్ల, ఫిబ్రవరి 8: ఈ నెల 12న మండలవ్యాప్తంగా నులి పురుగుల నివారణ దినోత్సవం ఉంటుందని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమ నిర్వహణపై వారు గురువారం తహసీల్ కార్యాలయంలో మండల అధికారులతో సమావేశమయ్యారు. తహసీల్దార్ తఫజ్జుల్ హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మధుసూదన్‌రావు, జాన్సన్, ఉషారాణి పాల్గొన్నారు.

ప్రాక్టికల్ సెంటర్ పరిశీలన

వైరాటౌన్, ఫిబ్రవరి 8: స్థానిక క్రాంతి జూనియర్ కళాశాలలో ఏర్పాటైన సైన్స్ ప్రాక్టికల్ పరీక్షల కేంద్రాన్ని డీఐఈవో రవిబాబు గురువారం పరిశీలించారు. కళాశాల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ జోజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

మృతుడి బంధువులతో మాట్లాడుతున్న ఎస్సై రాజేందర్

చింతకాని, ఫిబ్రవరి 8: విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని మత్కేపల్లి నామవరం గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నామవరం గ్రామానికి చెందిన జిల్లపల్లి నాగేందర్(50) ఇంటికి సమీపంలో తన వ్యవసాయ క్షేత్రంలోని బావి వద్ద విద్యుత్ మోటార్ ఆన్ చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎస్సై ఆలకుంట రాజేందర్ పరిశీలించారు. జరిగిన ఘటనపై మృతుని బంధువులు చింతకాని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్షయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **ఖమ్మం-2 బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికీ తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **బండి వీరన్న** S/o: **వెంకటేశ్వర్లు**, **వయస్సు :** 28సం॥లు, **వృత్తి :** వ్యాపారం, **నివాసం :** ఇ.నెం. 8-4-190/1, UPH Colony, భానాపురం హవేలి, ఖమ్మం నగరం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, కైయములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5 రోజు**లలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి పచ్చు అభ్యంతరములకు నా కక్షయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా అశ్వారావుపేట రిజిస్ట్రారు మరియు ఖమ్మం జాయింట్ సబ్ రిజిస్ట్రారు వారి అధికార పరిధిలో, ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్, ఖమ్మం జిల్లా, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, భానాపురం హవేలి, UPH Colony నందు గల A.C. Sheet Roof House, bearing H.No. 8-4-131 (old), New H.No. 15-21-130, సంబంధిత భాళీ స్థల యుక్తముగా మొత్తం **విస్తీర్ణం : 392-00 చ॥గజా॥ = 327-76 చ॥మీ॥**, Built-up Area, A.C. Sheet Roof House : 696.00 Sq.Feet (Including toilet) మరియు అందుగల విద్యుత్ ఫిట్టింగ్స్, విద్యుత్ సర్వీస్ కనెక్షన్ మరియు సమస్త ఫిక్చర్స్ యుక్తముగా **డాక్యుమెంట్ నెం. 11592/2019**గా గల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు:** బండి పద్మ గారి భాళీ స్థలం, **పడమర:** యు.రమణారెడ్డి గారి ఇల్లు మరియు చర్చి, **ఉత్తరం :** మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు, **దక్షిణము :** కెనాల్ రోడ్డు.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

క్షేత్రస్థాయి తనిఖీలు పూర్తిచేయాలి

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'రూ.500కే గ్యాస్' అమలుకు దరఖాస్తులు పరిశీలించాలి

అధికారుల టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం/ రఘునాథపాలెం, ఫిబ్రవరి 8: మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500కే గ్యాస్ సిలిండర్ అందించేందుకు లబ్ధిదారుల క్షేత్రస్థాయి తనిఖీలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. మహాలక్ష్మి పథకం క్షేత్ర తనిఖీల్లో భాగంగా కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలెక్టరేట్‌లోని తన కార్యాలయం నుంచి అధికారులతో గురువారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం జిల్లాలో 3,20,605 దరఖాస్తులు వచ్చాయని, వాటిల్లో 1,70,655 రేషన్ కార్డులు డాటాబేస్‌తో మ్యాపింగ్ అయి ఉన్నాయని తెలిపారు. మిగిలిన 1,49,950 దరఖాస్తులపై క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలని సూచించారు. దరఖాస్తుల్లో గ్యాస్ ఏజెన్సీ పేరు, వినియోగదారుడి నెంబరు పొందుపర్చని చోట వివరాలు సేకరించాలన్నారు. కుటుంబం యూనిట్‌గా దరఖాస్తుల పరిశీలన చేయాలన్నారు. జిల్లాలో 34 మంది గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారని, ప్రతి వినియోగదారుడూ గ్యాస్ కనెక్షన్‌ను ఆధార్‌తో లింక్ చేసుకున్నారని తెలిపారు. గ్యాస్ కనెక్షన్ లేని కుటుంబానికి ఆ విషయం తెలియజేయాలన్నారు. లబ్ధిదారుల పరిశీలనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా అధికారులు వీవీ అప్పారావు, హరికిషన్, చందన్‌కుమార్, జీ.గణేశ్, రాజేశ్వరి, శ్రీలత, సుమ, డిస్ట్రిబ్యూటర్లు అంకుర్, విమల్, కిరణ్, మనోజ్, వాసు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీవీ పాలెంలో పర్యటన

రఘునాథపాలెం మండలం వీ వెంకటాయపాలెంలో కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం పర్యటించారు. ప్రజాపాలన సిబ్బంది చేపడుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజాపాలన యాప్‌లో పొందుపరిచిన వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ ఏర్పాటుకు భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ) ఏర్పాటు కోసం కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభితో కలిసి కలెక్టర్ వీపీ గౌతమ్ ఖమ్మం జూబ్లీపుర లోని పాత డీపీఆర్‌వో కార్యాలయాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యాలయ నిర్మాణం ఎంతమేర ఉంది, భవనం పటిష్టత ఏంటి అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం పైఅంతస్తులో ఉన్న లైబ్రరీని పరిశీలించి సౌకర్యాల గురించి అడిగారు. కార్యాలయ ఆవరణలో ఉన్న యువజన సంక్షేమ అధికారి కార్యాలయ పాత భవనాన్ని పరిశీలించారు. అధికారులు డాక్టర్ రాములునాయక్, ఎంఏ గౌస్, రంజిత్, కృష్ణలాల్, వీ.శ్రీనివాసరావు, నీలోహన తదితరులు పాల్గొన్నారు.

12న మధిరలో గ్రీవెన్స్: కలెక్టర్

ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ఈ నెల 12న మధిర పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జాఫర్‌బావి పునరుద్ధరణ పనులు వేగంగా చేయాలి: కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 8: ఖమ్మంలోని జాఫర్‌బావి పునరుద్ధరణ, సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ బాధ్యురాలు కల్పన ఐడీవోసీలోని కలెక్టర్ వీపీ గౌతమ్‌ను గురువారం కలిసి బావి పునరుద్ధరణ పనుల పురోగతి గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఇంకా చేపట్టాల్సిన పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, డీఈ నవ్యజ్యోతి, ఆర్కిటెక్చర్లు వాత్సల్య, ప్రజ్వల్, స్పాన్సర్లు రాజశ్రీ, గీత తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలను పట్టుకున్న ఆంధ్రా పోలీసులు

'నమస్తే' కథనానికి స్పందన

మధిర, ఫిబ్రవరి 8 : అక్రమంగా ఆంధ్రా నుంచి తెలంగాణకు ఇసుకను లారీల ద్వారా తరలిస్తున్నా తెలంగాణకు చెందిన అధికారులు కనీసం కన్నెత్తి చూడకుండా అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయడంతో నిర్లక్ష్యం కనిపిస్తున్నది. బుధవారం 'ఆగని ఇసుక దందా' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైంది. ఈ కథనంతో స్పందించిన ఆంధ్రా పోలీసు అధికారులు గురువారం తెల్లవారుజామున ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయిలో 15 ఇసుక లారీలను పట్టుకొని సీజ్ చేశారు. తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాలకు చెందిన ఇసుక మాఫియాలు చేతులు కలిపి ఆంధ్రాలోని లింగాల మున్నేరు, ముత్యాల సమీపంలో గల కృష్ణా నది నందిగామ ప్రాంతంలో ఉన్న మున్నేరుల నుంచి ఇసుకను లారీల ద్వారా ఖమ్మంకు తరలిస్తున్నారు. ఆంధ్రా- తెలంగాణ సరిహద్దు బోనకల్లు సమీపంలో 15 లారీలను పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఇప్పటికైనా జిల్లాలోని సంబంధించి అధికారులు స్పందించి ఇసుక మాఫియాదారులు ఇసుక లారీలను అడ్డుకొని రవాణాను నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 8: మండలంలోని హైదర్‌సాయిపేట వద్ద ఆకేరు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను గురువారం తిరుమలాయపాలెం పోలీసులు పట్టుకున్నారు. ఆకేరు చెక్‌డ్యామ్ నుంచి అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు నిఘాపెట్టి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన ట్రాక్టర్లు పిండిప్రోలుకు చెందినవిగా గుర్తించి కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

చింతకాని, ఫిబ్రవరి 8: మున్నేరు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఆలకుంట రాజేందర్ హెచ్చరించారు. గురువారం మండలంలోని చిన్నమండవ గ్రామ సమీపంలోని మున్నేరు నది ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కూపన్లు లేకుండా ఇసుకను అక్రమ రవాణా చేస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని, ఎంతటవారినైనా ఉపేక్షించమని, కూపన్లు లేని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్నేరు సమీపంలో రోడ్డుకు అడ్డంగా గోయ్యి తీశారు.

వీరన్నకు నాయకుల నివాళి

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 8: మండలంలోని ఏదులాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు వెంపటి వీరన్న (48) ఆనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్, బెల్లం వేణుగోపాల్, వివిధ పార్టీల నాయకులు వీరన్న మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాప, సానుభూతి వ్యక్తం చేశారు.

'సేవాలాల్ జయంతిని సెలవుగా ప్రకటించాలి'

వైరా టౌన్, ఫిబ్రవరి 8: ఈ నెల 15న సేవాలాల్ జయంతి సందర్భంగా ఆ రోజు సెలవు దినంగా ప్రకటించాలని సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యేలు బాలూ నాయక్, మురళీనాయక్, రాందాస్ నాయక్ (వైరా) కోరారు. ఆయనను వారు గురువారం అసెంబ్లీలో కలిశారు. సేవాలాల్ జయంతి ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందించారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పాల్గొన్నారు.

ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది

ప్రజా సమస్యలు కాకుండా ఇతర అంశాలు చర్చకొస్తున్నాయి

సంఘాల సెమినార్‌లో ప్రముఖ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్

మాట్లాడుతున్న నాగేశ్వర్

ఖమ్మం కమాన్‌బజార్, ఫిబ్రవరి 8: దేశ ఆర్థిక వ్యవస్థ శరవేగంగా పెరుగుతోందని పాలకులు బాకాలు ఊదుతున్న సమయంలో ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతోందనే విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ పేర్కొన్నారు. ప్రజల కొనుగోలు శక్తి పెరగకుండా పారిశ్రామికాభివృద్ధి జరగదని అన్నారు. అయితే దేశంలో ప్రజల సమస్యలు కాకుండా ఇతర అనేక అంశాలు చర్చనీయాంశం అవుతున్నాయని, ఇది సరికాదని అన్నారు. ఈ నెల 16న తలపెట్టిన సార్వత్రిక సమ్మె అవశ్యకతపై కార్మిక, రైతు సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. తర్వలో సార్వత్రిక ఎన్నికలు ఉన్న సమయంలో ఈ నెల 16న జరిగే సమ్మె ఏమిటన్న చర్చ దేశంలో జరుగుతోందని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో దేశ వ్యాప్తంగా నెలకొన్న నిరుద్యోగం, ఉపాధి, సామాన్యుల సమస్యలు ఎజెండాగా ఉండాల్సిన సమయమిదని అన్నారు. కానీ ప్రస్తుతం వాటి ప్రస్తావనే జరగడం లేదని గుర్తుచేశారు. అయోధ్య రాముడిని ఏర్పాటు చేశామని, పాకిస్తాన్‌ను ఓడిస్తామని, చైనాను తరిమికొడతామని చెప్పుకుంటూ బీజేపీ ఓట్లు అడుగుతోందని విమర్శించారు. మీడియా కూడా ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని అన్నారు. నాయకులు బాగం హేమంతరావు, సాయిబాబా,పోటు ప్రసాద్, ఎర్రా శ్రీకాంత్ పాల్గొన్నారు.

సుబ్బారావు లాంటి వ్యక్తులు చాలా అరుదు

మామ 'తొట్టెంపూడి' సంస్మరణ సభలో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు

ఖమ్మం, ఫిబ్రవరి 8: తొట్టెంపూడి వెంకట సుబ్బారావు లాంటి వ్యక్తులు సమాజంలో చాలా అరుదుగా ఉంటారని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓ హోటల్ కాన్ఫరెన్స్ హాల్లో గురువారం జరిగిన తన మామ తొట్టెంపూడి వెంకట సుబ్బారావు సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. తన మామ సుబ్బారావు సేవలు, వ్యక్తిత్వం ఎంతో గొప్పవని అన్నారు. బతికినంత కాలం విలువలతోనే జీవించారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. పలువురు ప్రముఖులు, నాయకులు అయిన నల్లమల వెంకటేశ్వరరావు, తాళ్లూరి జీవన్, కోనేరు చిన్ని, కనకమేడల సత్యనారాయణ , బాణాల వెంకటేశ్వరరావు, చిత్తారు సింహాద్రియాదవ్, మోరంపూడి ప్రసాద్, వాకదాని కోటేశ్వరరావు, చీకటి రాంబాబు, రేగళ్ల కృష్ణప్రసాద్ తదితరులు కూడా పాల్గొని సుబ్బారావు మృతికి సంతాపం తెలిపి నివాళులర్పించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీలో కలెక్టర్ వీపీ గౌతమ్

పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఖమ్మం, ఫిబ్రవరి 8: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. ఖమ్మం వెంకటేశ్వరనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్‌సురభితో కలిసి గురువారం ఆయన తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిమిత్తం రోగుల నుంచి సేకరిస్తున్న రక్త నమూనాల గురించి, డయాగ్నోస్టిక్ హబ్‌కు రోజువారీగా పంపుతున్న నమూనాల గురించి అక్కడి వైద్యులను అడిగారు. ఎన్‌సీడీ రిజిస్టర్ పరిశీలించి ఎంతమందికి ఏయే రకాల మందులు ఇస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈడీడీ వివరాలను కేంద్రంలో ప్రదర్శించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. కుక్క, పాము కాటు మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ రాములునాయక్, అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు సరిచేయాలి

ఖమ్మం ఆర్డీవో గణేశ్

వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో

ముదిగొండ, ఫిబ్రవరి 8: ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు దొర్లితే విచారణ జరిపి సరిచేయాలని ఖమ్మం ఆర్డీవో గణేశ్ అన్నారు. గురువారం ముదిగొండలో పర్యటించిన ఆయన లబ్ధిదారుల ఇళ్లకెళ్లి వివరాలు తెలుసుకున్నారు. తమ సిబ్బంది అన్ని గ్రామాల్లో పర్యటిస్తారని లబ్ధిదారులు సహకరించి సమాచారం అందించాలని కోరారు. మరోసారి ఇబ్బందులు తలెత్తకుండా పక్కగా సమాచారం సేకరించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వై రామారావు, ఎంపీడీవో అశోక్, ఎంపీవో సూర్యనారాయణ, ఆర్ఐ వహీదా తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు నైతిక విలువలు పెంపొందించాలి

ఏసీపీ సుశీల్‌సింగ్ చౌహాన్

ఐక్వస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డైరెక్టర్ శ్రీవిద్య, ఏసీపీ సుశీల్‌సింగ్‌చౌహాన్

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8 : ప్రాథమిక విద్య నుంచే విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయడంతో పాటు నైతికవిలువలు పెంపొందించాలని ఏసీపీ సుశీల్‌సింగ్ చౌహాన్ అన్నారు. గురువారం నగరంలోని శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ పాఠశాలలో నిర్వహిస్తున్న జోనల్ ఐక్వస్ట్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన చిత్రలేఖనం, నృత్యం, సంగీతం, మేదస్సు, క్రీడాపోటీల్లో ఖాజీపేట, హన్మకొండ, రామగుండం, సిద్దిపేట, ఖమ్మం పాఠశాలల నుంచి 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీవిద్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం చేతన్‌మాధుర్, ప్రిన్సిపాల్స్ టీఎల్ఎన్ శర్మ, రాజ్‌కుమార్‌జోషి, ఏడుకొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్ శేఖర్ సహా ముగ్గురు ఆలయ పాలకమండలి సభ్యుల అరెస్ట్

జీళ్లచెరువు ఆలయ పరిధిలోని గుట్ట, కుంటలో మట్టి తవ్వకాలపై దేవాదాయశాఖ ఫిర్యాదు

ఖమ్మం కోర్టులో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి, ఫిబ్రవరి 8: ఆలయ పరిధిలోని గుట్ట, కుంటల్లో అక్రమంగా మట్టిని తవ్వించి, సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలపై పోలీసులు బుధవారం అర్ధరాత్రి ఖమ్మం డీసీసీబీ డైరెక్టర్లలో ఒకరైన ఇంటూరి శేఖర్‌తోపాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం గోపాలరావుపేటకు చెందిన ఇంటూరి శేఖర్ మూడేళ్ల నుంచి ఖమ్మం డీసీసీబీ పరిధిలో సేవలందిస్తున్న డైరెక్టర్లలో ఒక డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈయన కొన్నాళ్ల క్రితం కూసుమంచి మండల పరిధిలోని జీళ్లచెర్వు సీతారామచంద్రస్వామి ఆలయ పరిధిలోని గుట్టలు, కుంటల్లో అక్రమంగా మట్టిని తవ్వించి డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ సొమ్ము చేసుకున్నారని, ఈ అక్రమాలతో ఆలయ పాలక మండలి చైర్మన్ చెన్నా వెంకన్న, సభ్యులు కొండా వెంకన్న, చింతల పాటి రామకృష్ణకూ ప్రమేయం ఉందని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన ఫిర్యాదు మేరకు బుధవారం సాయంత్రం కూసుమంచి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్ధరాత్రి పోలీసులు ఖమ్మం నగరంలోని మమత ఆసుపత్రిలో నివాసం ఉంటున్న ఇంటూరి శేఖర్, జీళ్లచెరువులో నివాసం ఉంటున్న చెన్నా వెంకన్న, కొండా వెంకన్న, చింతలపాటి రామకృష్ణ ఇండ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం నిందితులను కొన్ని కారణాల రీత్యా నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం కూసుమంచి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై కె.రమేశ్ కుమార్ నిందితులపై ఐపీసీ 120/బీ, 409, 420, 447, 339 సెక్షన్లు, 3 అండ్ 4 పీడీ పీపీ సెక్షన్ల ప్రకారం కేసులు నమో దు చేశారు. అనంతరం నిందితులను ఖమ్మం కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద హైడ్రామా..

డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు ముగ్గురు ఆలయ పాలకమండలి సభ్యులను అదుపులోకి తీసుకున్న నేపథ్యంలో శేఖర్ సతీమణి, జడ్పీటీసీ బేబీ, శేఖర్ అనుచరులతో కలిసి బుధవారం అర్ధరాత్రి కూసుమంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కానీ శేఖర్‌తోపాటు మరో ముగ్గురిని నేలకొండపల్లి స్టేషన్‌కు తరలించారని సమాచారం అందుకుని, అక్కడికి వెళ్లి ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుతోపాటు పలువురు నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అరెస్ట్ చేయడం సరికాదని ధర్నా చేశారు. పోలీసులు గురువారం ఉదయం నిందితులను ఖమ్మం కోర్టుకు తరలించగా అక్కడ వారిని ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే కందాళ పరామర్శించారు.

ఆరుతడి పంటలకు సాగు నీరు ఇవ్వాలి

వైరా టౌన్, ఫిబ్రవరి 8: జిల్లాలోని సాగర్ ఆయకట్టు పంటలకు నీరు ఇవ్వాలని, చెరువులు-కుంటలను నింపాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో గురువారం సంఘం సమావేశంలో మాట్లాడుతూ.. కొన్ని మండలాల్లోని వాగులు, వంకలు , చెక్ డ్యామ్, ఏరుల్లో కూడా నీరు లేదని అన్నారు. నాయకులు తోట నాగేశ్వరరావు, బాణాల శ్రీనివాసరావు, కిలారు శ్రీనివాసరావు, మేడా శరబంది, తూము సుధాకర్, సామినేని బాబు, అనుమోలు రామారావు, బాజ్జోజ్ రమణ పాల్గొన్నారు.

'డీఎన్‌ఏ'తో పేదలకు చేయూత

వైరా టౌన్, ఫిబ్రవరి 8: పేద మహిళలు, విద్యార్థులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు పర్పుల్ డీఎన్ఏ సొసైటీ స్థాపించినట్లు దాని వ్యవస్థాపక అధ్యక్షుడు చిత్తలూరి శ్రీనివాసరావు చెప్పారు. కుట్టు మిషన్ కేంద్రం ఏర్పాటుకు 15 మిషన్లను ఆయనకు లయన్స్ క్లబ్ వైరా అధ్యక్షుడు పెనుగొండ ఉపేంద్రరావు బుధవారం అందించారు. చిత్తలూరి మాట్లాడుతూ.. తమ సొసైటీ చేపట్టబోయే సేవాకార్యక్రమాలకు అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు చోడవరపు బద్రీనాథ్, చిత్తలూరి అఖిల్, వెంకటేశ్వరరావు, చింతోజు నాగేశ్వరరావు, కొల్లా రాంబాబు, మాదినేని సునీత పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై అవగాహన

కారేపల్లి, పిబ్రవరి 8: కుష్ఠు వ్యాధిపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పేరుపల్లి ప్రాథమిక ఉప ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, వ్యాప్తికి కారణాలు, నివారణ జాగ్రత్తలు తదితరాంశాలను వివరించారు. విజయకుమార్, పి.మాధవి, ఏఎన్ఎంలు ఈసం కృష్ణవేణి, పొదెం నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్స్‌లో ఎస్‌బీఐటీ విద్యార్థి ఎంపిక

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 8: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన సంగీత్ ఎంఎన్‌సీ కంపెనీ ఎయిర్‌టెల్‌లో వైర్‌లెస్ యాక్సస్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాడని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో 135మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. సంగీ